ప్రజాశక్తి
శనివారం 14 డిసెంబర్ 2024



ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి శ్రేణులు

ఎట్టకేలకు ఎన్నికలు..!

- నేటి నుంచి సాగునీటి సంఘాల ఎన్నికలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ఆదోనిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు, పాఠశాల సిబ్బంది

ఇప్పటికే పలు దఫాలుగా వాయిదా పడిన సాగునీటి సంఘాల ఎన్నికలు ఎట్టకేలకు జరగనున్నాయి. శనివారం నుండి ఎన్నికలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 533 సాగునీటి సంఘాలు ఉన్నాయి. వాటిలో కర్నూలు జిల్లాలో 284 సాగునీటి సంఘాలు, నంద్యాల జిల్లాలో 249 సాగునీటి సంఘాలు ఉన్నాయి. వాటి ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి సంఘాల ఎన్నికలు గత నెలలోనే జరగాల్సి ఉండగా ఇప్పటికే పలు సార్లు వాయిదా పడ్డాయి. శనివారం నుండి సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 533 సాగునీటి సంఘాలు ఉన్నాయి. వాటిలో కర్నూలు జిల్లాలో 284 సాగునీటి సంఘాలు, నంద్యాల జిల్లాలో 249 సాగునీటి సంఘాలు ఉన్నాయి. కర్నూలు జిల్లాలో కెసి కెనాల్ కింద 2,65,624 ఎకరాల ఆయకట్టు ఉండగా 86 సాగునీటి సంఘాలు ఉన్నాయి. తుంగభద్ర ఎల్ఎల్‌సి కింద 1,51,134 ఎకరాల ఆయకట్టు ఉండగా 58 సాగునీటి సంఘాలు, గాజులదిన్నె ప్రాజెక్టు కింద 25,435 ఎకరాల ఆయకట్టు ఉండగా 12 సాగు నీటి సంఘాలు, రాంపురం ఛానల్ కింద 1,378 ఎకరాల ఆయకట్టు ఉండగా ఒక సాగునీటి సంఘం ఉన్నాయి. కర్నూలు మైనర్ ఇరిగేషన్ కింద 21,623 ఎకరాల ఆయకట్టు ఉండగా 47 సాగునీటి సంఘాలు, నంద్యాల మైనర్ ఇరిగేషన్ కింద 29,756 ఎకరాల ఆయకట్టు ఉండగా 08 సాగునీటి సంఘాలు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో తెలుగు గంగ ప్రాజెక్టు కింద 18 మండలాల్లో స్థిరీకరించిన 1,31,079 ఎకరాలకు సంబంధించి 47 సాగునీటి వినియోగదారుల సంఘాలు, కెసి కెనాల్ కింద 18 మండలాల్లో స్థిరీకరించిన ఆయకట్టు 1,51,592 ఎకరాలకు సంబంధించి 47 సాగునీటి వినియోగదారుల సంఘాలు, ఎస్ఆర్‌బిసి కింద 9 మండలాల్లో స్థిరీకరించిన ఆయకట్టు 1,51,925 ఎకరాలకు సంబంధించి 50 సాగునీటి వినియోగదారుల సంఘాలు, మైనర్ ఇరిగేషన్ చెరువుల కింద 18 మండలాల్లో స్థిరీకరించిన ఆయకట్టు 43,200 ఎకరాలకు సంబంధించి 105 సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయి. వాటికి ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

మూడు దశల్లో ఎన్నికలు..

శనివారం నుంచి మూడు దశల్లో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలి దశలో సాగు నీటి సంఘాలు (డబ్ల్యూయుఎ) ఎన్నికలు నిర్వహిస్తారు. ఆ సంఘం పరిధిలోని ఆయకట్టు రైతులు ఆరుగురు డైరెక్టర్లను ఎన్నుకుంటారు. రెండో దశలో సాగు నీటి సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ పాలకవర్గాన్ని ఎన్నుకుంటారు. మూడో దశలో ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు నిర్వహిస్తారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలోని అధ్యక్షులు ప్రాజెక్టు కమిటీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, డైరెక్టర్లను ఎన్నుకుంటాయి. ఈ ఎన్నికల్లో ఆయా ప్రాజెక్టుల ఇంజనీర్లతో పాటు తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, ఆర్‌డిఓ, సబ్ కలెక్టర్లు కీలక భూమిక పోషిస్తారు. ఎన్నికల నిర్వహణ జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో జరుగుతాయి. తొమ్మిదేళ్ల తరువాత సాగు నీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తుండటంతో ఆయకట్టు రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. ప్రాజెక్టులు, కాల్వల నిర్వహణ ఈ కమిటీల ఆధ్వర్యంలోనే కొనసాగుతాయి. పూడికతీత, పంట కాలువల ఆధునీకరణ, ప్రధాన కాలువల మరమ్మతులు తదితర పనులు రైతుల భాగస్వామ్యంతో నిర్వహిస్తారు.

రైతులకు పెట్టుబడి సాయం ఏమైంది

- గిట్టుబాటు ధర కల్పించాలి
- కర్నూలులో వైసిపి నిరస ప్రదర్శన
- కలెక్టరేట్ ఎదుట ధర్నా.. డిఆర్‌ఒకు వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు వెంటనే రూ 20 వేలపెట్టుబడి సహాయం ఇవ్వాలని, ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వైసిపి ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అంతకు ముందు శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేశారు. డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేశారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు ఎస్‌వి మోహన్ రెడ్డి డిమాండ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం రైతులను మోసగించిందన్నారు. గతంలో తమ ప్రభుత్వ ఆయాయంలో రైతులకు ప్రతి ఏడాది పెట్టుబడి సాయాన్ని అందించే వారమన్నారు. సూపర్ సిక్స్ అమలులో భాగంగా రైతులకు పెట్టుబడి సాయాన్ని ఇస్తామని ప్రకటించారని, అమలు చేయలేదన్నారు. రైతులకు ఉచిత పంటల బీమా పథకాన్ని కూడా అమలు చేయడం లేదని పేర్కొన్నారు. రైతుల పండించిన పంటలకు కనీసం మద్దతు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. రైతుల సంక్షేమాన్ని ఈ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. మరోసారి ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులను నమ్మించి మోసం చేశారన్నారు. రైతులకు సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను ఖర్చు చేసిందన్నారు. జిల్లాలో పత్తి పంటకు మద్దతు ధర లేకపోవడంతో రైతులు తీవ్ర నష్టపోతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం బడ్జెట్‌లో లెక్కలు చూపారని, ఆచరణలో మాత్రం ఎక్కడా అమలు చేయడం లేదన్నారు. రైతులను మోసగించిన ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం ప్రజలు చెబుతారని అన్నారు. అనంతరం డిఆర్‌ఓ వెంకటనారాయణమ్మను ఆ పార్టీ జిల్లా ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించింది. ఈ కార్యక్రమంలో మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, కర్నూలు మేయర్ బివై.రామయ్య, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, మాజీ ఎంపీ, ఎమ్మిగనూరు ఇన్చార్జి బుట్టా రేణుక, కూడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, కోట్ల హరి చక్రపాణి రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ అభ్యర్థి ఆదిమూలపు సతీష్ పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయాలి

- ఐదో రోజూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల రిలే నిరాహార దీక్షలు
- పిపిఎస్‌ఎస్ నాయకుల మద్దతు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

స్వతంత్ర భారతదేశంలో చట్టాన్ని అమలు జరపండని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అడిగే పరిస్థితి రావడం సిగ్గుచేటని, సుప్రీంకోర్టు ఆదేశాలను ఎందుకు అమలు చేయరని పట్టణ పౌర సంక్షేమ సంఘం (పిపిఎస్ఎస్) నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎస్.రమణగౌడ్ ప్రశ్నించారు. నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ వర్కర్స్ చేస్తున్న ఐదో రోజు సమ్మెకు పట్టణ పౌరసంక్షేమ సంఘం నాయకులు మద్దతు తెలిపారు. పిపిఎస్ఎస్ నాయకులు మాట్లాడుతూ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఉండాలని అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చినా పాలకులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఇంజనీరింగ్ సెక్షన్‌లో పని చేసే కార్మికుల పరిస్థితి దీనంగా తయారైందన్నారు. నగరపాలక సంస్థ సిబ్బంది లాగా వారు కనిపించడంలేదన్నారు. పదేళ్ల సర్వీసు అనంతరం పర్మినెంట్ చేయాలని, మధ్యలో మరణిస్తే కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని, రిటైర్డ్ అనంతరం పెన్షన్ ఇవ్వాలని, సెలవులు కావాలని కోరడం గొంతెమ్మ కోరికలు ఏమి కాదని వాటిని వెంటనే అమలు జరపాలని డిమాండ్ చేశారు. ప్రజలకు సేవలు అందించే ఇంజనీరింగ్ వర్కర్స్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే కూటమి ప్రభుత్వాన్ని కూడా పడుతుందని హెచ్చరించారు. ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పాలకుల, ఉన్నతాధికారుల చుట్టూ తిరిగినా.. మా సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.మనోహర్ అధ్యక్ష వహించారు. నగర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి కె.జ్ఞానమ్మ, ఎస్.షేక్షావలి, ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు పాల్గొన్నారు.

మద్దతుగా మాట్లాడుతున్న ఈ.పుల్లారెడ్డి

రైతు శ్రమ నేలపాలు

- టమోటాను కొనలేం
- నాణ్యతను బట్టి కొంటాం వ్యాపారులు
- మార్కెట్‌లోనే పడేస్తున్న రైతులు

ప్రజాశక్తి-పత్తికొండ

రోజు రోజుకు టమోటా ధర పతనం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌లోని టమోటా వేలంపాటలో వ్యాపారులు టమోటా మాకొద్దు అంటూ ముందుకు వెళ్తున్న సంఘటనలు కనబడుతున్నాయి. మార్కెట్లోని టమోటాను వ్యాపారస్తులు కొనుగోలు చేయకపోవడంతో అక్కడే పోసిన టమోటా దృశ్యాలు నిత్యం దర్శనమిస్తున్నాయి. నాణ్యతపేరుచెప్పి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అధికారులు మాత్రం ధర కల్పిస్తామని గొప్పలు చెబుతున్నారు. ఆరుగాలం కష్టపడిన రైతు శ్రమ నేలపాలవుతుంది.

ఖరీఫ్ సీజన్లోని పత్తికొండ, దేవనకొండ,మద్దికేర, తుగ్గలి,మండలాల్లోని 1020 ఎకరాలలో టమోటాను రైతులు సాగు చేశారు. రబీ సీజన్లో 320 ఎకరాలలో సాగు అయినట్లు అధికారులు చెబుతున్నారు. జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో టమోటా సాగు చేసిన రైతులకు ధర ఆశాజనకంగా ఉంది. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాలలో టమోటాను రైతులు సాగు చేశారు. టమోటా పంటను కోత కోసి పత్తికొండ టమోటా మార్కెట్ తీసుకొని వస్తే తక్కువ ధరతో కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టమోటా నాణ్యతను బట్టి వ్యాపారస్తులు కొనుగోలు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. కిలో రూ.1నుండి రూ 8 కొనుగోలు చేస్తున్నారు. నాణ్యతలేని టమోటాను వ్యాపారస్తులు కొనుగోలు చేయకపోవడంతో రైతులు ప్లాట్ ఫారం పైనే పారబోసి ఇంటికి వెళ్తున్నారు. ప్రత్యేకంగా శుక్రవారం మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక మహానగరాలలో టమోటా పంట అందుబాటులోకి వచ్చిందని సుదూర ప్రాంతాలకు టమోటా ఎగుమతులు లేవని వ్యాపారస్తులు పేర్కొంటున్నారు. టమోటా పంట కోసి మార్కెట్ కు తీసుకొని వస్తే రవాణా చార్జీ కూలీలు కూడా రావడం లేదంటూ రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. సాగుచేసిన సాగు చేయడానికి పెట్టిన పెట్టుబడులు కూడా రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక అయోమయంలో ఉన్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ కు 42 టన్నులు వచ్చాయని, గరిష్టం రూ.18, మధ్యధర, రూ.12 కనిష్టధర, రూ.8తో టమోటాను కొనుగోలు చేశారని మార్కెట్ అధికారులు వివరాలు వెల్లడించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు టమోటా కు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరారు.

ధర లేకపోవడంతో మార్కెట్‌లో పారబోసిన టమోటా పంట

రెండో సారి టమోటా పంటను మార్కెట్‌కు తెచ్చాం

- రైతు బజారమ్మ, దూదేకొండ గ్రామం

రబీ సీజన్‌లో 1.50 ఎకరాలలో టమోటా పంటను సాగు చేశాను. రూ.70 వేల పెట్టుబడి పెట్టాను. రెండోసారి కోత కోసి టమోటా పంటను మార్కెట్ తీసుకొచ్చాం. జత 30 కిలోల గంపల రూ.330 కొనుగోలు చేశారు. సరుకు ఎక్కువగా వచ్చినప్పుడు ధరపతనమవుతుంది. నాణ్యత లేదని రైతులు కొనలేమంటున్నారు. టమోట ధర పడిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అందుకే రైతులు ఆరుగాలం కష్టించి పండించిన టమోటాను మార్కెట్‌లోపడేసి పోతున్నారు.

రైతులను మోసపోకుండా గిట్టుబాటు ధర కల్పిస్తాం

- మార్కెట్ సెక్రెటరీ కార్నోలీస్

టమోటా రైతులు నష్టపోకుండా టమోటాకు గిట్టుబాటు ధర కల్పిస్తాం. రైతులు టమోటాలను సక్రమంగా గ్రేడింగ్ చేసుకొని రావాలని తెలియజేస్తున్నాం. నాణ్యత ఉండి తక్కువ ధరలకు కొనుగోలు చేస్తే వ్యాపారస్తులపై చర్యలు తీసుకుంటాం.

కుక్కల బెడద నివారణకు చర్యలు

రోజుకు 35 శునకాలకు కుటుంబ నియంత్రణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరంలో వీధి కుక్కల బెడద నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. శుక్రవారం గార్గేపురం డంప్‌యార్డులోని కుక్కల సంతాన నియంత్రణ ఆపరేషన్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వీధి శునకాల బెడద ఎక్కువ అయినట్లు ప్రజాప్రతినిధులు, ప్రజల నుండి అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలను వేగవంతం చేసినట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు డంప్ యార్డులో ఉన్న కుక్కల సంతాన నియంత్రణ కేంద్రంలో ప్రతి రోజూ 20 శునకాలకు ఆపరేషన్లను చేయడానికి సౌకర్యాలు ఉన్నాయని, అదనంగా మరో 15 శునకాలకు ఆపరేషన్లు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అందుకు సంబంధించిన నిర్మాణాలను చేపట్టేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించి త్వరలో పనులు ప్రారంభిస్తామని, పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. వీటి నిర్వహణ కోసం యానిమల్ వెల్ఫేర్ బోర్డు ఆఫ్ ఇండియా (ఎడబ్ల్యుబిఐ) మార్గదర్శకాలను పాటించామని, అక్కడి నుండి త్వరలో అనుమతులు వస్తాయన్నారు. వచ్చిన వెంటనే తొలి దశగా ప్రతిరోజూ 20 కుక్కలకు ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. ఇదేకాకుండా నగరంలో పూర్తి స్థాయిలో కుక్కల బెడద నియంత్రణకు భవిష్యత్తు మరిన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. వెటర్నరీ డాక్టర్ మల్లన్న, డిఇఇ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

హంద్రినదిలోకి మురుగు నీటిని రానివ్వకండి

తహశీల్దార్‌కు విన్నవించిన దూపాడు గ్రామస్తులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

బాత్రూములు, టాయిలెట్లునుండి వచ్చే మురికి నీళ్లు హంద్రి నదిలోకలిసి కలుషితమై పోతున్నాయి. వెంటనే కాలువలు బంద్ చేసి హంద్రీ నదిలో నీళ్లు కలుషితం కాకుండా కాపాడాలని శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో గ్రామ ప్రజలందరూ సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ, మండల కార్యదర్శి ఎ.కృష్ణ మండల నాయకులు మధు, శాఖ కార్యదర్శి హరిబాబు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి హంద్రీనది నీళ్లు గ్రామ ప్రజలందరూ తాగే వాళ్లని ఎటువంటి అనారోగ్య పరిస్థితులు ఉండేవి కాదన్నారు. కెవిసుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ , అశోక ఉమెన్స్ కాలేజీ, బాలాజీ వెంచర్ వాళ్ళు తమ బాత్రూంలు, మరుగుదొడ్ల నుండి వచ్చే వ్యర్థ నీళ్లన్నీ కలిసి కలుషితమై గ్రామ ప్రజలు అనారోగ్య ఫాలవుతున్నారని తెలిపారు. వెంటనే హంద్రీ నది లోకి వచ్చే వ్యర్థపు నీళ్లన్నీ కలసకుండా నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామనిహెచ్చరించారు. తహశీల్దార్ ఆంజనేయులు మాట్లాడుతూ వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఐక్యపోరాటాలకు సిద్ధం

-గూడూరు, సి బెళగల్ ప్రాంతీయ మహాసభ
-సమస్యల పరిష్కారానికి సభతీర్మానం
-ప్రాంతీయ కార్యదర్శిగా జె.మోహన్

ప్రజాశక్తి-గూడూరు

గూడూరు మండల సమస్యల పరిష్కారానికి పార్టీలకతీతంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెవి.నారాయణ సూచించారు. గూడూరులో సిపిఎం ప్రాంతీయ 3వ మహాసభలు వీరభద్రస్వామి కళ్యాణమండపంలో రాజశేఖర్, ఖాజా హుస్సేన్‌ల అధ్యక్షతన నిర్వహించారు. మహాసభలో గూడూరు సి.బెలగల్ మండలాల సిపిఎం ప్రతినిధులు హాజరయ్యారు. పి.నిర్మల, కెవి.నారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గూడూరు మండలం సమస్యల పరిష్కారానికి పార్టీలకతీతంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. గూడూరు పట్టణాన్ని మున్సిపాలిటీగా చేశారు తప్ప ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదని అన్నారు. రూ.54 కోట్లతో నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకులను పూర్తి చేసి ప్రజలకు తాగునీటిని అందించాలన్నారు. గూడూరు పట్టణంలో 80 శాతం మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, గూడూరు మున్సిపాలిటీ చేయడంతో ఇక్కడ ఉపాధి హామీ చట్టం అమలు కావడం లేదని, గూడూరు పట్టణ ప్రజలు వ్యవసాయ పనులు అయిపోతే వలసలు వెళ్ళిపోతున్నారన్నారు. గూడూరు పట్టణంలో ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తే వలసలను నివారించవచ్చన్నారు. గూడూరు మహాసభలో మండల కార్యదర్శి జె. మోహన్ గత మూడేళ్ల కాలంలో పార్టీ నిర్వహించిన కార్యక్రమాల నివేదికను ప్రవేశపెట్టారు. భవిష్యత్తులో మండల నెలకొన్న సమస్యల పై మహాసభలో తీర్మానం ప్రవేశ పెట్టారు. అనంతరం సిపిఎం గూడూరు, సి.బెలగల్ మండలాల ప్రాంతీయ కమిటీని ఎన్నుకున్నారు. ప్రాంతీయ కార్యదర్శిగా జె.మోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా రాజశేఖర్, వెంకటేశ్వర్లు, కోటేశ్వరయ్య, రవి, ఇబ్రహీం, శేషమ్మలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గూడూరు సిపిఎం నాయకులు దానమన్న, రాజు, మధు, మద్దిలేటి, చనుగొండ్ల నాయకులు మాధవ కృష్ణయ్య, రామాంజనేయులు, రమేష్, రంగడు, నాగలాపురం ప్రతాప్, మారెప్ప, సుధాకర్, సత్యాలు, బెలగల్ సుందర్ రాజు, రంగన్న, మంగమ్మ, రాముడు, మద్దిలేటి, గూడూరు బెలగల్ మండలాల్లోని సిపిఎం సభ్యులు హాజరయ్యారు.

గూడూరు, సి బెళగల్ ప్రాంతీయ మహాసభలో మాట్లాడుతున్న పి.నిర్మల

మాట్లాడుతున్న క్లస్టర్ యూనివర్సిటీ విసి సాయి గోపాల్

మహిళలపై దాడులను అరికట్టాలి

క్లస్టర్ యూనివర్సిటీ విసి సాయి గోపాల్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని వైస్ ఛాన్సలర్ డివిఆర్ సాయి గోపాల్ అన్నారు. క్లస్టర్ విశ్వవిద్యాలయంలో మహిళా సాధికారత శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం 'లైంగిక వేధింపులను నియంత్రించే చర్యలు' అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరయిన విసి మాట్లాడుతూ సమాజంలో తల్లిదండ్రుల పాత్ర చాలా కీలకమైందన్నారు. తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని గుర్తు చేశారు. ప్రముఖ న్యాయవాది తేజోవతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన ఉండాలని, అలా ఉన్నప్పుడే మనకు జరిగే అన్యాయాలను ఎదిరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిల్వర్ జూబ్లీ కాలేజ్ ప్రిన్సిపల్ వివిఎస్.కుమార్, మహిళా సాధికారత సమన్వయకర్త అక్తర్ భాను, వైస్ ప్రిన్సిపల్ రెడ్డి ప్రసాద్‌రెడ్డి , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలను తగ్గించాలి : సిపిఎం

ట్రూఅప్ ఛార్జీలను రద్దువేయాలి- పలుచోట్ల విద్యుత్ బిల్లుల దహనం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజల దగ్గర నుండి అక్రమంగా వసూలు చేస్తున్న ట్రూ ఆఫ్ చార్జీలను ఇతర చార్జీలను రద్దు చేయాలని కోరుతూ సిపిఎం పార్టీ ఓల్డ్ సిటీ కమిటీ జొహరాపురం 17వార్డు పై ఆటో స్టాండ్ దగ్గర జోహారాపురం హమాలి శాఖ ఆధ్వర్యంలో ఆ శాఖ కార్యదర్శి సంసోను అధ్యక్షతన నిరసన తెలిపారు. కరెంట్ బిల్లులను దహనం చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు విజయ రామాంజనేయులు మాట్లాడుతూ అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కరెంటు బిల్లులు పెంచబోమని,స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని, నిత్యవసర సరుకులు ధరలు తగ్గిస్తామని, ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాల అమలు ఏమైందని ప్రశ్నించారు. కర్నూలు శ్రీరామనగర్‌లో 23వ వార్డు సిపిఎం వార్డు కమిటీ ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లు ఇళ్లకు పెట్టే విధానాన్ని మానుకోవాలని, ట్రూ ఆఫ్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ రెండు ప్రాంతాలలో ప్రజలను సమీకరించి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కరెంటు బిల్లులను దహనం చేసి నిరసనతెలిపారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.నరసింహులు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన నూతన ఎలక్ట్రిసిటీ విధానం వల్ల ట్రూ ఆఫ్ చార్జీలు, కరెంటు చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారాన్ని వేశాయన్నారు.

కర్నూలు హాస్పిటల్ : కర్నూలు న్యూ సిటీ పరిధి కల్లూరు 84, 85 సచివాలయాల ముందు సిపిఎం ఆధ్వర్యంలో కరెంటు బిల్లులు దగ్ధం చేసి నిరసన తెలిపారు. సిపిఎం సీనియర్ నాయకులు రమణమూర్తి, నగర కమిటీ సభ్యులు హుస్సేన్‌బాష మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రోజురోజుకు ప్రజలపై భారలే లక్ష్యంగా పనిచేస్తుందని, కార్పొరేట్లకు కొమ్ముగాసే విధంగా కూటమి ప్రభుత్వం పనితీరు ఉందని విమర్శించారు. పెంచిన కరెంటు చార్జీలను తగ్గించాలని, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను బిగించవద్దని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలందరినీ ఏకం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా భవిష్యత్తులో పెద్ద ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. 27 వ వార్డు కృష్ణానగర్ ఐటిసి వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ట్రూఅప్ చార్జీ లపేరుతో కూటమి ప్రభుత్వం ప్రజల పై వేసిన భారాలకు నిరసనగా విద్యుత్ బిల్లులను దహనం చేశారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ సాయిబాబా, కృష్ణానగర్ కార్యదర్శి ఎం.లక్ష్మయ్య మాట్లాడారు. షరీన్ నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. సిపిఎం నగర నాయకులు జి.ఏసు మాట్లాడారు. ఉలిందకొండలో విద్యుత్ చార్జీలు తగ్గించాలని మండలంలోని ఉలిందకొండ గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను దహనం చేశారు.

విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న శ్రీనివాస్, బాష

విద్యుత్ బిల్లులను చూపుతున్న సిసిఎం జిల్లా కమిటీ సభ్యుడు, విజయ్ తదితరులు

బిల్లులతో సాయిబాబ, తదితరుల నిరసన

నన్నూరులో విద్యుత్ బిల్లులతో నిరసన

సుందర పట్టణానికి కృషి

- రూ.2 కోట్లతో రహదారుల నిర్మాణం
- ప్రతి ఇంటికీ 24 గంటల పాటు తాగునీరు
- ఎమ్మెల్యే డాక్టర్ బివి.జయనాగేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బివి

పట్టణాన్ని సుందరంగా తయారు చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ బివి.జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. పట్టణంలో ప్రతి ఇంట్లో పండగలాగా జరుపుకునే ఎమ్మిగనూరు శ్రీనీల కంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా పట్టణంలోని మార్కెట్ యార్డు రోడ్డు నుంచి కర్నూలు బైపాస్ రోడ్డు వరకు రూ.2 కోట్లతో రహదారి నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. శుక్రవారం రహదారుల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి హయాంలోనే రోడ్ల అభివృద్ధి జరిగిందని, వైసిపి ఒక్క గుంత కూడా పూడ్చిన దాఖలాలు లేవని విమర్శించారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నామని, సెంట్రల్ లైటింగ్ కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఆదర్శ మున్సిపల్‌గా నిలబెడతామని, పట్టణ ప్రజలకు 24 గంటల పాటు తాగునీరు అందిస్తామని చెప్పారు. వైసిపి ప్రభుత్వంలో వెనక్కి వెళ్లిన టెక్స్‌టైల్ పార్కును మళ్లీ తీసుకొచ్చామని తెలిపారు. కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. రీ సర్వే పేరుతో రైతులకు, ప్రజలకు గత వైసిపి ప్రభుత్వం గట్ల పంచాయతీ తెచ్చిపెట్టిందని, వైసిపి చేసిన తప్పిదాలను కూటమి ప్రభుత్వం సరిదిద్దుతోందని తెలిపారు. తన తండ్రి, మాజీ మంత్రి బివి.మోహన్ రెడ్డి తెచ్చిన గురు రాఘవేంద్ర ప్రాజెక్టులో దొంగలు మోటార్లు ఎత్తుకెళ్లినా ఐదేళ్లుగా వైసిపి పట్టించుకోలేదన్నారు. తాను రూ.2 వేల కోట్లతో ఆర్‌డిఎస్ ప్రాజెక్టును తీసుకొస్తే రివర్స్ టెండర్ పేరుతో వైసిపి నాశనం చేసిందని మండిపడ్డారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, టిడిపి నాయకులు బందే నవాజ్, తురేగల్ నజీర్ అహ్మద్, రాందాస్ గౌడ్, రంగస్వామి గౌడ్, మధుబాబు, భీమేష్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

సమ్మెకు సిద్ధం : మున్సిపల్ ఉద్యోగులు

ప్రజాశక్తి - ఆదోని

ప్రదర్శన చేపడుతున్న మున్సిపల్ ఉద్యోగులు

తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే సర్వీసులను నిలిపివేసి పూర్తి స్థాయిలో సమ్మెకు దిగుతామని ఏపి మున్సిపల్ ఇంజినీరింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు సోమన్న, హమీద్, రామాంజనేయులు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ పంపు హౌస్ నుంచి నినాదాలు చేస్తూ శ్రీనివాస భవన్, అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దశాబ్ద కాలంగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్నామని, తమ సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో అహర్నిశలు శ్రమించామని, ఇతరులకు వేతనాలు పెంచారే తప్ప ఇంజినీరింగ్ సెక్షన్ ఉద్యోగులను విస్మరించారని వాపోయారు. ఇప్పటికైనా రూ.26 వేలు వేతనం, పదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా శాంతియుతంగా నిరసన చేస్తున్నామని, ఇలాగే నిర్లక్ష్యం చేస్తే నీటి సరఫరా నిలిపివేసి సమ్మెకు కూడా వెనకాడబోమని హెచ్చరించారు. నాయకులు పాండు, షాషావలీ, శీనా, భరత్ ఉన్నారు.

సమిష్టి కృషితోనే గ్రామాలాభివృద్ధి

- ఎంపిడిఒ అల్లాబకాష్

ప్రజాశక్తి - చిప్పగిరి



మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి సురేంద్ర

ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగుల సమిష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపిడిఒ అల్లా బకాష్, ఇఒఆర్‌డి బాలన్న, చిప్పగిరి పంచాయతీ కార్యదర్శి సురేంద్ర తెలిపారు. శుక్రవారం మండల కార్యాలయంలో సమృద్ధి లక్ష్యాలపై రెండోరోజూ ఇఒఆర్‌డి బాలన్న ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. గ్రామాలను ఒక యూనిట్‌గా తీసుకొని నిర్దేశించుకున్న లక్ష్యాలను పూర్తి చేసే బాధ్యత అందరిపైనా ఉంటుందని తెలిపారు. మౌలిక సదుపాయాలు, నీటి సమృద్ధి, పరిశుభ్రత, మనబడి, సామాజిక భద్రతపై దృష్టి సారించాలని సూచించారు. పేదరికం లేని గ్రామాలుగా తీర్చిదిద్దే బాధ్యత అందరిపై ఉంటుందన్నారు. గ్రామాల్లో విధులు నిర్వర్తించే ప్రతి అధికారి కూడా ప్రజాప్రతినిధులతోనూ గ్రామ పెద్దలతోనూ సమన్వయంతో పని చేసుకుంటేనే ఆ గ్రామం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ఎంఇఒ సావిత్రమ్మ, పరిపాలన అధికారి శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు జయరాం నాయక్, ప్రమీల, నరసింహులు, హౌసింగ్ ఎఇ భవ్య, ఎపిఒ జుబేర్ అహ్మద్ పాల్గొన్నారు.

పల్లెల్లో ఎన్నికల సందడి..!

- 14న సాగునీటి సంఘాలకు, 17న డిస్ట్రిబ్యూషన్ కమిటీలకు - తాజాగా నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

వివిధ కారణాలతో రెండుసార్లు వాయిదా పడిన సాగునీటి సంఘాల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల అయింది. జలవనరుల సంరక్షణకు గత టిడిపి పాలనలో సాగునీటి సంఘాలుండేవి. వీటిని వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జలవనరులకు పూర్వవైభవం రానుంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం తొలిసారి పల్లెల్లో ఎన్నికల సందడి నెలకొననుంది.

మండలంలో మైనర్ ఇరిగేషన్ శాఖ పరిధిలో పెద్దహరివాణం శ్రీమహాయోగి లక్ష్మమ్మ చెరువు, నాగనాథనహళ్లి చెరువు, ఢణాపురం చెరువు, ఇస్వి పెద్ద చెరువు, ఎల్‌ఎల్‌సి కాలువ పరిధిలో సంతేకుడ్లూరు-7, పెద్దహరివాణం-6 పరిధిలో ఈ ఎన్నికలు జరగనున్నాయి. మైనర్ ఇరిగేషన్ శాఖలో చెరువులకు 400 మందికి పైగా, ఎల్‌ఎల్‌సి పరిధిలో 800 మందికి పైగా ఓటర్లు ఉండవచ్చని అంచనా. చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు సభ్యులను ఎన్నుకుంటారు. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో ఆయా తహశీల్దార్, ఎంపిడిఒ, నీటిపారుదల శాఖ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాల వద్ద నోటీసు బోర్డుల్లో నోటిఫికేషన్లను ప్రకటించారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం సాగునీటి సంఘాలకు రెండు అంచెల్లో ఎన్నికలు జరుగుతాయి. 14న సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, 17న డిస్ట్రిబ్యూషన్ కమిటీలకు ఎన్నికలు జరుగుతాయి. చిన్ననీటి పారుదలకు సంబంధించి ఒక్కో సంఘంలో ఆరుగురు సభ్యులు, మధ్యతరహాకు సంబంధించి ఒక్కో సంఘంలో 12 మంది సభ్యులు ఉంటారు.

సాగునీటి సంఘాల బలోపేతానికి 2014లో టిడిపి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించింది. సాగునీటి వనరులకు ఇబ్బందులు లేకుండా ఉన్నాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో కాలువల్లో గుర్రపు డెక్క, పూడిక తీత వంటి పనులు చేపట్టేవారు. వర్షాకాలంలో చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా చూసేవారు. ఒకవేళ గండ్లు పడినా తక్షణమే పూడ్చి వేసేలా సాగునీటి సంఘాలు చర్యలు తీసుకునేవి. 2019 తర్వాత వైసిపి ప్రభుత్వం సాగునీటి సంఘాలను పూర్తిగా విస్మరించింది. చెరువులు, మీడియం ప్రాజెక్టుల నిర్వహణ అటకెక్కింది. చెరువులు, ప్రాజెక్టుల పునరుద్ధరణ పనులు పూర్తిగా ఆగిపోవడంతో వీటికి ప్రస్తుతం నీరు చేరే పరిస్థితి లేదు. ఈ కారణంగా వర్షాలు సమృద్ధిగా కురిసినా పంటల సాగుకు నీరందడం లేదు. ఈ క్రమంలో సాగునీటి సంఘాలను పునరుద్ధరిస్తామని కూటమి పార్టీ నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం హామీ అమలు దిశగా చర్యలు ప్రారంభించారు.

రైతు సమస్యలు గాలికి..

రైతు సమస్యలు, నీటిపారుదల వ్యవస్థ పర్యవేక్షణలో సాగునీటి సంఘాలు కీలకంగా వ్యవహరించేవి. చెరువులు, కాలువల్లో పూడికతీత, తూముల నిర్మాణం, ఆధునీకరణ పనులు, పొలాలకు ముంపునకు గురికాకుండా చూడడం వంటివి ఈ సంఘాలు చేసేవి. రూ.5 లక్షల్లోపు పనులను సంఘాలే నామినేషన్ పద్ధతిలో చేయించేవి. గత ఐదేళ్లుగా నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో చిన్న సమస్యల పరిష్కారానికి సైతం అధికారులపైనే ఆధారపడాల్సి వచ్చింది. ఇరిగేషన్ శాఖాధికారులకు బాధ్యతలు అప్పగించడంతో ప్రతి పనికి వారే అంచనాలు రూపొందించి టెండర్లు పిలిచేవారు. దీనివల్ల పనుల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది. సాగునీటి సంఘాలు లేకపోవడం వల్ల పంట కాలువలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పంట కాలువలు పూడుకు పోవడంతో శివారు భూములకు ఏటా సాగునీటి కొరత తప్పడం లేదు. వర్షాలు వస్తే బోదెలు పూడుకుపోవడంతో నీరు దిగక పంటలను కోల్పోవాల్సిన పరిస్థితి. ప్రస్తుతం నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తుండడంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

నాయకుల చుట్టూ ప్రదక్షిణలు

చైర్మన్ పదవి దక్కించుకోవాలని ఆశావహులు స్థానిక నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో ఒకపక్క బిజెపి నాయకులు, మరో పక్క జనసేన నాయకులు, టిడిపిలో గ్రూపు విభేదాల వల్ల మూడు గ్రూపులుగా చైర్మన్ పదవి కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, రెండో దశ నాయకులను కలుస్తూ వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో గెలుపు ఎవరిదో వేచి చూడాల్సిందే.

తుంగను తవ్వేస్తున్నారు..!

- ఆగని ఇసుక దొంగల ఆగడాలు
- పోలీసు, రెవెన్యూ శాఖ నిర్లక్ష్యం

ప్రజాశక్తి - నందవరం

నందవరం మండలం నాగలదిన్నె గ్రామం వద్ద తుంగభద్ర నదిలో ఇసుకను విచ్చలవిడిగా తవ్వేస్తున్నారు. మూడురోజుల నుంచి తుంగభద్ర నది నుంచి ఎమ్మిగనూరు, నందవరం మండలంలో వివిధ గ్రామాలకు యథేచ్ఛగా కొంతమంది వ్యక్తులు ఇసుకను తరలిస్తున్నారు. పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇసుక పాలసీ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందని ద్రాక్షలా మారింది. మధ్యతరగతి కుటుంబం ఇల్లు నిర్మించుకోవాలంటే ట్రాక్టర్ ఇసుకకు రూ.4 వేల నుంచి రూ.6 వేలు వెచ్చించాల్సిన వస్తుంది. కొంతమంది వ్యక్తులు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా తుంగభద్ర నదిలో ఇసుకను తరలిస్తుండడం వల్ల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఇసుక అక్రమ రవాణా వల్ల గ్రామానికి తాగునీటి ఎద్దడి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రాష్ట్రాలను కలుపుతూ నిర్మించిన నాగలదిన్నె వంతెనకు ఇసుక తవ్వకాల వల్ల ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోలీసు, రెవెన్యూ శాఖాధికారుల నిర్లక్ష్యం

తుంగభద్ర నదిలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్నా పోలీసు, రెవెన్యూ శాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న వ్యక్తులను అడ్డగించి అడిగితే వారి దగ్గర ఏ విధమైన అనుమతులు లేవు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ ద్వారా ఇసుకను తీసుకెళ్లాలి. అవేమీ లెక్క చేయకుండా కొంతమంది వ్యక్తులు ఇసుకను రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న అలాంటి వ్యక్తులపై చర్యలు తీసుకోవడంలో రెవెన్యూ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నాగలదిన్నె నుంచి ఎమ్మిగనూరుకు ఇసుక రవాణా చేసే వ్యక్తులు నందవరం పోలీసు స్టేషన్ ముందుగానే ట్రాక్టర్లను తరలిస్తున్నారు. స్టేషన్ ముందు నుంచే అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నా పోలీసు అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

తుంగభద్ర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు

ఎన్నికలా..? ఏకగ్రీవమా..?

- సాగునీటి సంఘాల్లో రాజకీయ వేడి

ప్రజాశక్తి - కౌతాళం

కర్నూలు జిల్లాలో జరుగుతున్న సాగునీటి సంఘాలకు ఎన్నికలు పోటాపోటీగా జరుగుతాయా..? లేక ఏకగ్రీవంగా ఎన్నుకోబడతారా అని రాజకీయ చర్చ వేడెక్కింది. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన ఆరు నెలలకు జరుగుతున్న ఎన్నికలు కావడంతో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఏ విధంగా ఎన్నికల్లోకి దిగుతున్నారో అని తెలుసుకునేందుకు ఆయకట్టు రైతుల్లో అలజడి మొదలైంది.

జిల్లాలో తుంగభద్ర దిగువ కాలువ, కెసి కెనాల్, ఆలూరు బ్రాంచి కెనాల్ (ఎబిసి), గాజులదిన్నె ప్రాజెక్ట్, మైనర్ ఇరిగేషన్‌లకు సాగునీటి సంఘాలను ఎన్నుకునేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. కెసి కెనాల్ కింద 2, ఎల్ఎల్‌సి కింద 58, ఆలూరు బ్రాంచి కెనాల్ 6, హెచ్ఎన్ఎస్ఎస్ 3, గాజులదిన్నె ప్రాజెక్టు 12, మైనర్ ఇరిగేషన్లు 41, రామాపురం 1, మొత్తం 123 స్థానాలకు సాగునీటి సంఘం అధ్యక్షులను ఎన్నుకోవడానికి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఆలూరు నియోజకవర్గం నుంచి 1, మంత్రాలయం నుంచి 3, ఎమ్మిగనూరు నుంచి 3, కోడుమూరు నుంచి 3 మొత్తం పది స్థానాల్లో డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షులను ఎన్నుకుంటారు. వీరిలో ఒకరిని ప్రాజెక్టు ఛైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఈనెల 14న ఎన్నికైన టిసి మెంబర్లు అదే రోజున అధ్యక్షులను ఎన్నుకుంటారు. 17న సాగునీటి సంఘం అధ్యక్షులు డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షులను ఎన్నుకుంటారు. ప్రాజెక్ట్ ఛైర్మన్‌కు నోటిఫికేషన్ అనంతరం ఎన్నుకుంటారని అధికారులు వెల్లడించారు. ఈ ఎన్నికలు నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం సిద్ధం చేసింది. వివిధ డిస్ట్రిబ్యూటర్ల కింద టిసి మెంబర్లను, వారు సాగునీటి సంఘం అధ్యక్షులను, ఆ అధ్యక్షులు డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షులను, డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షులు ప్రాజెక్ట్ ఛైర్మన్‌ను ఎన్నుకునేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ ఎన్నికలపై అధికార పార్టీ నాయకులు టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, మంత్రాలయం ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి, టిడిపి ఆలూరు నాయకులు వీరభద్ర గౌడ్ ప్రత్యేక దృష్టి సారించారు. వివిధ నాయకులు పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఎక్కువ స్థానాలు ఏకగ్రీవంగా ఎన్నుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీ వైసిపి నాయకులు ఈ ఎన్నికల పట్ల ఎక్కువగా ఆసక్తి చూపకపోవడంతో అధికార పార్టీ వైపు గాలి వీస్తోందని సమాచారం. కొన్ని ప్రాంతాల్లో వైసిపి మద్దతుతో పోటీ చేసేందుకు ముందుకు వస్తున్నట్లు తెలిసింది. ఎన్నికలు రాజకీయ వేడిని పుట్టిస్తాయో..! తుంగభద్ర జలాల మాదిరిగా సల్లగా సాగుతాయో వేచి చూడాల్సిందే..!

తుంగభద్ర దిగువ కాలువ (ఫైల్)

నేడు 'సాగునీటి' ఎన్నికలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

తుంగభద్ర దిగువ కాలువ గోనెగండ్ల సెక్షన్ పరిధిలో గోనెగండ్ల, అలువాల, పెద్దనేలటూరుతో పాటు సిబెళగల్ కలుపుకొని నాలుగు సాగునీటి సంఘాలు ఉన్నాయి. గాజులదిన్నె ప్రాజెక్టు పరిధిలో మండలంలోని హెచ్.కైరవాడి, ఒంటెడుదిన్నె, ఎస్.లింగందిన్నె, కున్నూరు, తిప్పనూరు సంఘాలతో పాటు కోడుమూరు, క్రిష్ణగిరి మండలాల పరిధిలో మొత్తం కలుపుకొని 12 సాగునీటి సంఘాలు ఉన్నాయి. వీటన్నిటికీ నేడు ఎన్నికలు జరగనున్నాయి. ఆయా సంఘాల పరిధిలో ఓటర్లు అయిన రైతులందరూ ఉదయం 8 గంటల వరకే వారికి నిర్దేశించిన కేంద్రాలకు చేరుకోవాలి. మొదట వారికి సాగునీటి వినియోగం, సాగునీటి సంఘాలపై అవగాహన కల్పిస్తారు. అనంతరం 9 నుంచి 9.45 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 10.30 గంటల వరకు నామినేషన్లను పరిశీలించి తుది జాబితాను ప్రకటిస్తారు. 12.30 గంటల వరకు ప్రాదేశిక సభ్యుల ఎన్నికను చేతులు ఎత్తడం లేదా ఓటింగ్ నిర్వహించి ఎన్నుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల్లోపు ఆయా సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎన్నుకుంటారు. ఆయా సంఘాల్లో ప్రాదేశిక సభ్యులతో పాటు అధ్యక్షులను తాము అనుకున్న వారిని గెలిపించుకునేందుకు అధికార టిడిపి ముమ్మరంగా పావులు కదుపుతుండగా వైసిపిలో మాత్రం ఎలాంటి ప్రయత్నమూ కనిపించడం లేదు. నేడు జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యేనా లేదా పోటీ జరిగేనా అని మండల ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి కొన్ని సమస్యాత్మక కేంద్రాల్లో తగిన పోలీసు బందోబస్తుతో పాటు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎన్నికల అధికారులు, తహశీల్దార్ కుమారస్వామి, గాజులదిన్నె ప్రాజెక్టు డిఇ విజయకుమార్, ఎఇ చిన్నఅలీ, ఎల్ఎల్‌సి ఎఇ ఉదయ భాస్కర్ శుక్రవారం తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ : సిఐ గంగాధర్

ఎన్నికలు నిర్వహించే గోనెగండ్ల జడ్‌పి హైస్కూల్, హెచ్.కైరవాడి హై స్కూల్, ఎంపిపి స్కూల్, అలువాల, పెద్దనేలటూరు జడ్‌పి హైస్కూల్, తిప్పనూరు గ్రామ సచివాలయం ప్రాజెక్టులోని ఎపి మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల తదితర ప్రాంతాల్లో 500 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు సిఐ గంగాధర్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో గుంపులుగా సంచరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏర్పాట్లపై సమీక్షిస్తున్న అధికారులు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - గోనెగండ్ల

అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం గోనెగండ్లలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, సిఐ గంగాధర్ వివరాల మేరకు... గోనెగండ్లలో కురువ పూజారి రంగముని (46) తనకున్న మూడున్నర ఎకరాల పొలంతో పాటు సుమారు పది ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. మిరప, ఉల్లి, వేరుశనగ లాంటి పంటలు సాగు చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడం దిగుబడి వచ్చినా గిట్టుబాటు ధర లేక సుమారు రూ.15 లక్షల మేర అప్పు చేశారు. ఈ సంవత్సరం కూడా అధికంగా మిరప పంటతో పాటు వేరుశనగ సాగు చేశారు. ఈ క్రమంలో అప్పులు ఎలా తీర్చాలని ఆవేదనకు గురై శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

టిడిపితోనే మైనార్టీల అభివృద్ధి

- టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం ఫకృద్దీన్

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి హయాంలోనే ముస్లిం, మైనార్టీలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందని టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం ఫకృద్దీన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని తెలిపారు. కొత్త వక్ఫ్ బోర్డు ఏర్పాటుకు ఉత్తర్వులు ఇచ్చామని, కలెక్టర్ల సదస్సు చివరిరోజు మైనారిటీ సంక్షేమ శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష జరిపారని చెప్పారు. బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో విద్యకు పెద్దపీట వేశారని, పెండింగ్‌లో ఉన్న వైద్య కళాశాలను పూర్తి చేయిస్తామని హామీ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ప్రతినెలా మెడికల్ క్యాంపు

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఆదోని

సంక్షేమ హాస్టల్, కెజిబివి, గురుకుల హాస్టల్‌లో ప్రతినెలా విద్యార్థులకు మెడికల్ క్యాంపు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతినెలా మెడికల్ క్యాంపు నిర్వహించకపోవడం వల్ల విద్యార్థులు అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి ప్రతినెలా మెడికల్ క్యాంపు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టుపై దాడి చేసిన వారిని శిక్షించాలి

- ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

కడప జిల్లా వేములలో జర్నలిస్టులపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ గౌరవాధ్యక్షులు నాగరాజు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బసవరాజు, మునెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పులివెందుల నియోజకవర్గం వేములలో నీటి సంఘాల ఎన్నికల కవరేజ్‌కు వెళ్లిన సాక్షి రిపోర్టర్ శ్రీనివాస్, కెమెరామెన్ రాము, సాక్షి పత్రిక విలేకరి రాజారెడ్డిపై కూటమి నేతలు దాడికి పాల్పడడం సమంజసం కాదన్నారు. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ ఉపాధ్యక్షులు విజయ్, మురళీ, నాయకులు భీమా, మల్లికార్జున, సభ్యులు రఘునాథ్ రెడ్డి, వీరేష్, రామచంద్ర, సుంకన్న పాల్గొన్నారు. **మంత్రాలయం** తహశీల్దార్ ఎస్.రవికి వినతిపత్రం అందజేశారు. సీనియర్ పాత్రికేయులు పరశురామ్, పాత్రికేయులు లక్ష్మయ్య శెట్టి, గురుస్వామి, వీరశేఖర్ శెట్టి, గాబ్రెల్, మాధవ్ పాల్గొన్నారు. **హోళగుంద** మండలం లింగదహళ్లి గ్రామంలో రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఎపియుడబ్ల్యుజె నాయకులు నాగప్ప, విరుపాక్షి, రవి కాంత్, మహేష్ గౌడ్, మధు, తాహెర్ పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

మంత్రాలయంలో

ప్రత్యేక తరగతులతో ఇబ్బంది...

- ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి విజయ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వినతి పత్రం అందిస్తున్న నాయకులు

సమయపాలన పాటించకుండా విద్యార్థినులను ఇబ్బందికి గురి చేస్తూ ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు స్టడీ క్లాసుల పేరుతో పాఠశాలల్లోనే ఉంచుకుంటున్నారని, 8 తర్వాత ఇళ్లకు వెళ్లమని చెబుతున్నారని, చాలామంది విద్యార్థులు రాత్రిపూట వారి గ్రామాలకు చేరుకోవడానికి రోడ్లపై నిలబడాల్సి వస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి విజయ్ తెలిపారు. శుక్రవారం ఎంఇఒ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలోని కొన్ని ప్రయివేట్ పాఠశాలలు స్పెషల్ క్లాస్‌ల పేరుతో రెండో శనివారం, ఆదివారం కూడా సెలవులు ఇవ్వడం లేదన్నారు. విద్యార్థినులకు రక్షణ కల్పించే చర్యల్లో భాగంగా ఈ స్పెషల్ క్లాస్‌ల సమయాలను మార్చాలని కోరారు. విద్యార్థినులకు ఏదైనా జరిగితే ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలతో పాటు విద్యాశాఖ అధికారి నిర్లక్ష్యం కూడా అవుతుందని తెలిపారు. ఎస్ఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షులు అగ్గి రాముడు, భాస్కర్, రవితేజ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆశాకిరణం సీజనల్ హాస్టల్స్

- ఎస్ఐ బాల నరసింహులు, ఎంఇఒ సత్యనారాయణ

ప్రజాశక్తి - హోళగుంద

వలస విద్యార్థుల ఆశాకిరణం సీజనల్ హాస్టల్స్ అని ఎస్ఐ బాల నరసింహులు, ఎంఇఒ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం హోళగుందలో అంబేద్కర్ సెల్ఫ్ హెల్ప్ గ్రూపు, వరలక్ష్మి సెల్ఫ్ హెల్ప్ గ్రూపు ఆధ్వర్యంలో రెండు సీజనల్ హాస్టల్ సెంటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో విద్యార్థులు వలసలు వెళ్లకుండా రెండు సీజనల్ హాస్టల్స్ ద్వారా 100 మంది విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు విద్యనందించేందుకు ప్రభుత్వం చొరవ చూపడం హర్షణీయమని తెలిపారు. సీజనల్ హాస్టల్స్ వలస విద్యార్థులకు ఆశాకిరణాలుగా మిగిలిపోతాయని కొనియాడారు. బాగా చదువుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలన్నారు. వలస వెళ్లే తల్లిదండ్రులు ఎవరైనా ఉంటే వారి పిల్లలను సీజనల్ హాస్టల్‌లో చేర్పించాలని సూచించారు. ఈ సెంటర్లలో డిఎడ్, బిఎడ్ పూర్తి చేసిన వారిచే విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వలస విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు సిహెచ్.నాగరాజు, డిఆర్‌డిఎ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ సూర్య ప్రకాష్, మేజర్ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, సర్పంచి చలవాది రంగమ్మ తనయుడు పంపాపతి, వెలుగు సిసి హనుమంతు, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ సభ్యులు, దళిత సమాఖ్య మండల నాయకులు మల్లేష్, వీరేష్, లాల్ సాబ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న బుట్టా రేణుక

'చలో కర్నూలు'కు వైసిపి కార్యకర్తలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక ఆధ్వర్యంలో శుక్రవారం కర్నూలు జిల్లాలో జరిగే 'అన్నదాతకు అండగా' నిరసనకు వైసిపి కార్యకర్తలు తరలివెళ్లారు. బుట్టా రేణుక,బుట్టా శివ నీలకంఠలు జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు.

సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - దేవనకొండ

భూమి పూజ చేస్తున్న నాయకులు

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ఆలయం సమీపంలోని శివాలయం రోడ్డు, బాలికల వసతి గృహం సమీపంలో రూ.10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు టిడిపి నాయకులు, మాజీ ఎంపిటిసి నాగేష్, చిన్న రాముడు, తిమ్మప్ప, మాల రాముడు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో భాగంగా కూటమి నాయకుల సహకారంతో సిసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి రాముడు పాల్గొన్నారు.

15న మాలల మహా గర్జనకు తరలిరండి

- మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది

మాట్లాడుతున్న మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది

ప్రజాశక్తి - ఆలూరు

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 15న గుంటూరు, నల్లపాడు రోడ్డులోని హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్వహించే మాలల మహా గర్జన సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు మహానంది కోరారు. శుక్రవారం ఆలూరు ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ఆలోచనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో సుప్రీంకోర్టు వర్గీకరణ చెల్లదని తీర్పునిచ్చిందని గుర్తు చేస్తూ వర్గీకరణ చట్టబద్ధత లేదన్నారు. మాలలకు నష్టం కలిగే ఎస్సీ వర్గీకరణ అంగీకరించేది లేదని తెలిపారు. మాలలు అధిక సంఖ్యలో పాల్గొని మహాగర్జనను విజయవంతం చేయాలని కోరారు. మాల మహానాడు నాయకులు లక్ష్మీనారాయణ, భరత్, పరమేష్, వెంకటేష్, మల్లప్ప పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూసమస్యలు పరిష్కారం

- తహశీల్దార్ సతీష్

ప్రజాశక్తి - హోళగుంద

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలను పరిష్కరిస్తామని, వచ్చిన ప్రతి వినతులను పరిశీలించి అర్హులకు న్యాయం చేస్తామని తహశీల్దార్ సతీష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని లింగదహళ్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామం మొత్తం మీద 10 దరఖాస్తులు భూ సమస్యలకు అందించినవి, కుల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి 27 దరఖాస్తులు వచ్చాయన్నారు. డిప్యూటీ తహశీల్దార్ నిజాముద్దీన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ సతీష్

మహారాజశ్రీ కర్నూలు 7వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో

M.V.O.P. No. 170/2024

ఎస్. హరిశంకర్ ... అర్జిదారు

V/S

బండికి మల్లికార్జున వగైరా ... రెస్పాండెంటు

1వ రెస్పాండెంటుకు నోటీసులు

బండికి మల్లికార్జున S/o. బి. మల్లయ్య, H.No. 76-111-46-23-2, బృందావన నగర్, కర్నూలు-3, ట్రక్కర లారి ఓనర్, AP-23Y-5496 పై నెంబర్ M.V.O.P. లో అర్జిదారు తనకు 27-01-2024 తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తిగిలిన గాయములకు నష్టపరిహారము రూ. 5,00,000/- ఇందుపైన ప్రమాదము జరిగిన రోజు నుండి 12% P.A. ప్రకారము వడ్డీతో మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ అర్జిదాఖలు చేసినాడు. ఇందుపైన 1వ రెస్పాండెంటు అయిన నీకు ఆక్షేపణ ఉన్న 31-12-2024 తేదీన పగలు 10-30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల నీ పరోక్షమున విచారించి తీర్మానించపబడును.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు

కడియాల రామపుల్లయ్య
అర్జిదారుపరం అడ్వకేటు,
కర్నూలు.